www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 05 | నవంబర్ | 2026
పేజీలు : 8

ఖిల్లా రోప్‌వే పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



-రోప్‌వేకు అనుబంధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన ఏజెన్సీ అధికారులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితి లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోప్‌వే నిర్మాణ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతిపై రోప్‌వే నిర్మాణ సంస్థ సిఈవో రంజిత్ పరకాసి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా చారిత్రిక ప్రాధాన్యతను, పర్యాటక ఆకర్షణను దృష్టిలో ఉంచుకుని రోప్‌వే ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా మిగతా 2లో..

అతలాకుతలం చేసిన మురసు





-ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
-నేలకొరిగిన కోతకు వచ్చిన వరి
-దెబ్బతిన్న పత్తి, మిర్చి తోటలు
- సత్తుపల్లి, అశ్వారావుపేట సహా పలు చోట్ల పొంగిపొర్లిన వాగులు



ప్రకృతి మరోసారి రైతాంగంపై విరుచుకు పడింది. అష్ట కష్టాలు పడి పండించుకున్న పంటలను ఒక్కసారిగా దెబ్బతీసింది. చేతికి వచ్చిన వరి పంట నేలపాలు కాగా పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మురసు తుఫాన్ కారణంగా మంగళవారం చిరుజల్లులతో ప్రారంభమై బుధవారం భారీ వర్షం కురిసింది. ఈ ఏడాదికి పలు చోట్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, పెనుబల్లి చండ్రుగొండ, నేలకొండపల్లి తదితర ప్రాంతాలలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు మూడు రోజుల్లో కోయాల్సిన వరి పొలాలు నేలకొరగడంతో పాటు వాటిపై నుంచి నీరు పారడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పూర్తయి పంట చేతికందే దశలో మురసు తుఫాన్ కోలుకోలేనివిధంగా దెబ్బతీసింది. రైతాంగం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారు. తుఫాన్ కారణంగా నష్టం వాటిల్లడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. మురసు తుఫాన్ కారణంగా జన జీవనం స్తంభించింది. లంకాసాగర్ సహా పలు చెరువులు అలుగులు పడ్డాయి.

లోపలి పేజీల్లో

-ప్రజాపక్షం/ఖమ్మం

చికిత్స పొందుతూ కండక్టర్ ప్రవళిక మృతి

ప్రవళిక మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి : సిపిఐ





ప్రజాపక్షం/మణుగూరు: గత నెల 25వ తేదీన మణుగూరు నుండి భద్రాచలం బయలుదేరిన బస్సులో జరిగిన వివాదంలో గాయపడిన కండక్టర్ ప్రవల్లిక మంగళవారం హైదరాబాద్లోని సాయి సంజీవిని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందింది.. ఆమె మృతి సందర్భంగా బుధవారం ఖమ్మం డివిజన్లోని ఆర్టీసీ కార్మికులు ఆమెకి సంతాపం తెలుపుతూ విధులు బహిష్కరించారు.. మణుగూరు పట్టణంలో బుధవారం ఆమెకి సంఘీభావం తెలుపుతూ ఆ కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవ చేస్తూ కర్తవ్యం నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులకు భద్రత కరువైందని ప్రభుత్వం ఈ విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని అదేవిధంగా మృతి చెందిన ప్రవల్లిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రవళిక మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి..



గుండ్ల ప్రవళిక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా చర్యలు పటిష్టంగా చేపట్టాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గుండ్ల ప్రవళిక కు మద్దతుగా ఆర్టీసీ జేఏసీ కార్మికులు మణుగూరు పట్టణంలో ఆర్టీసీ డిపో కార్యాలయం నుండి అంబేద్కర్ మిగతా 2లో..



ముంచెత్తిన మురసు తుఫాన్

- కుండపోత వాన, పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- సుమారు 5వేల ఎకరాల్లో పంట నష్టం
- తెగిపోయిన దారులు, కొట్టుకుపోయిన అప్రోచ్‌రోడ్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- తెగిపోయిన పెద్దవాగు ప్రాజెక్ట్ రింగ్‌బండ్
- బొగ్గు అత్పత్తికి ఆటంకం






ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ః మురసు తుఫాన్ జిల్లాను ముంచెత్తింది. గత 48 గం.లపాటు ఎడతెరిపిలో కుండా కురిసిన వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్థం చేసింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకు పోవ డంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా మండలాల్లోన్ని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అప్రోచ్ రోడ్‌లు కొట్టుకుపోయాయి. ప్రధాన రహదార్లపై నీళ్లు పొంగిపొర్లుతున్నాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేర డంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గోదావరి తాలిపేరు కిన్నెరసాని పెద్దవాగులో జలకళ ఉట్టిపడుతోంది. సింగరేణి వ్యాప్తంగా మురసు తుఫాను కారణంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే సుమారు ఐదువేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గింతేగానీ నివేదికలు పూర్తి స్థాయిలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా వరి, మినుపు పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే కోసిన ధాన్యం పలు చోట్ల తడిసి పోయింది. మరో ప్రక్క పత్తికి తీవ్ర వివత్తు పొంచి ఉంది. ఇదే తరహా వానలు మరో నాలుగు రోజుల పాటు కొనసాగితే కోతకు సిద్ధంగా ఉన్న పత్తితో పాటు పత్తి కాయలు నల్ల బడి చేతికందే పరిస్థితి లేదు. పత్తికి మంచి ధర పలుకుతున్న నేపథ్యంలో ఈ ముసరు రైతుల ఉసురు పోసుకుంటుంది అంటూ పలు వ్యవసాయాధిరిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.ములకలపల్లి మండలంలో రాజపేట పాములేరు వాగు సమీపంలో ఇటీవల నిర్మించిన రూ.60 లక్షల అప్రోచ్ రోడ్ తెగిపోయింది. జగన్నాధపురం గ్రామంలో సబ్ స్టేషన్ వద్ద బ్రిడ్జీ, సత్యంపేట వాగు బ్రిడ్జీ పై నుండి సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో వరద ప్రవహిస్తోంది. దీంతో మండల నుండి పాల్వంచ దమ్మపేట సత్తుపల్లికి రాకపోకలు నిలిచిపో యాయి. వాగులు వంకలు పొంగిపొర్లడంతో చెరువులు అలుగులు పడి పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. తాళ్లవాయిపంచాయితీ పరిధిలో నసరత్ కుంట చెరువు అలుగుపడటంతో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ముంపుకు గుర య్యాయి. కొత్తగూడెం నియోజకవర్గంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతు న్నాయి. చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి వంతెన ములుగు గూడెం వంతెన పై నుంచి వాగు ప్రవహిస్తోంది. సుజాతనగర్ మండలం లక్ష్మీ దేవిపల్లి గరిబోపేట గ్రామాల మధ్య వాగు లోవల్ వంతెనపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామా లకు రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ మండలంలోని దంతెలబోర గొల్ల గూడెం ప్రాంతాల్లో వాగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది.పాల్వంచ మండలంలో దంతెలబోరు బండ్రుగొండ రహదారి వరదనీటిలో మునిగిపోయింది. పలు పంటల పొలాలు నీటిలో తెలియాడుతున్నాయి. 8,42వ డివిజన్లలో వరదనీరు చేరడంతో మునకు గురయ్యాయి. మేయర్ మూడ్ గణేష్ వరదనీటిని మళ్లించే పనులను స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించిన ఆయన వరద నీరు నీల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి ప్రభుత్వ పాఠశాల్లోకి మోకాళ్లలోతు నీళ్లు చేరాయి. అశ్వారావుపేట నియోజకవర్గం కేంద్రంలో ఖమ్మం,భద్రాచలం రోడ్లు పైనీరు వరదలై పారుతుండటంతో వాహనాల రాకపో కలకు ఆటంకం ఏర్పడింది. దూదేకుల బజార్ నాల్గవ వార్డులో, హోసన్న ప్రార్థనా మందిరం ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. దొంతుకుంట చెరువులోకి భారీగావరద నీరు చేరడంతో చెరువు కట్ట చెరువుకు గండి పడటంతో నీరు రోడ్లపై పారుతోంది. సంతమార్కెట్ జలమ యమైంది. పద్దవాగు ప్రాజక్టుకు నీటి ఉధృతి పెరగడంతో లాకులు ఎత్తిన అధికా రులు నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో రింగ్‌బండ్ తెగిపోవడంతో నీటి ప్రవాహం పెద్దఎత్తున పెరిగి సమీప గ్రామాల్లోకి నీరు చేరుతోంది. నారవా రిగూడెం, గుర్రాల చెరువు రోడ్ తెగి రోడ్డుపై పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహి స్తోంది. దమ్మపేట మండలం కొత్తపేట కాలనీలోకి వరదనీరు చెరడంతో బాధితు లను పునరావాస కేంద్రాలకు డిప్యుటీ కలెక్టర్ తరలించారు. మద్దులపల్లి దమ్మ పేట రోడ్‌పై భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. అశన్నగూడెం నాగుపల్లి మధ్య రోడ్డుపై మల్లెపూల వాగు పొంగి పొర్లుతోంది. అశ్వారావుపేట మండలంలో ముంపుకు గురైన ప్రాంతాలను మున్సిపల్ కమీషనర్ దిలీప్‌రెడ్డి తన సిబ్బందితో పరామర్శించారు. కౌన్సిలర్ కొల్లి రవికుమార్ బాధితులకు అండగా నిలుస్తు న్నారు. ముంపు ప్రాంతాలను కౌన్సిలర్ డా.జ్యోతి పరిశీలించి బాధితులను పరా మర్శించి ధైర్యం చెప్పారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గుబ్బలమంగి వాగు అలుగుపారుతోంది. ఆళ్ల పల్లి,గుండాల, పినపాక, అశ్వాపురం, కరకగూడెం, బూర్గంపాడు మండలాల్లోని పలు వాగులు వంకలు పొంగిపొర్లి గోదావరిలో కలుస్తున్నాయి. ఎగువన కూడా తుఫాను ప్రభావం ఉండటంతో గోదావరికి వరదనీరు వచ్చి చేరుతోంది. తుఫాన్ ప్రభావంతో జనజీవన అస్తవ్యస్థంగా మారింది.

క్షణికావేశం ఒకరి ప్రాణాలను బలిగొంది..



-మరొకరిని కటకటాల వెనక్కి పంపింది
-డబ్బు కంటే ప్రాణం విలువైందని మరిచిన క్షణం
-రెండు కుటుంబాల్లో కన్నీటి కథను మిగిల్చింది

ప్రజాపక్షం/మణుగూరుః కోపం క్షణకా లమే.. కానీ ఆ కోపంలో తీసుకునే నిర్ణయా లు జీవితాంతం వెంటాడుతాయి. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది మణుగూరులో చోటుచేసుకున్న ఓ విషాద ఘటన.ఆర్టీసీ బస్సులో కేవలం రూ.90 విషయమై ఇద్దరు మహిళల మధ్య మొదలైన చిన్నపాటి వాగ్వాదం.. చివరకు పెనుగులాటకు దారితీసింది. ఒకరు ఆర్టీసీ కండ క్టర్ ప్రవళిక కాగా, మరొకరు ఇద్దరు పిల్లల తల్లి అయిన గృహిణి. మాటామాటా పెరిగి ఇద్దరూ ఘర్షణ పడటంతో అదుపుతప్పి కండక్టర్ ప్రవళిక కిందపడిపోయారు. ఈ క్రమంలో కండక్టర్ ప్రవళిక కాళ్లపై బస్సు చక్రాలు వెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడి. మృతి చెందటం అందరినీ కలచివేస్తోంది. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి గృహిణి జైలు పాలైంది.

ఒక్కసారి ఆలోచించండి..

కేవలం రూ.90 కోసం మొదలైన వివాదం ఎక్కడికి దారితీసింది? ఒక మహిళ మృతి. మరో మహిళ జైలు గోడల మధ్య తన పిల్లలకు దూర మైంది. ఇద్దరు మహిళల కుటుంబాల్లోనూ ఇప్పుడు కన్నీళ్లే మిగి లాయి.ఆవేశం ముందు ఆలోచన ఓడిపోతే.. అనర్థమే మిగులుతుంది! డబ్బు పోతే సంపాదించుకోవచ్చు.. మాట జారితే క్షమాపణ చెప్పుకో వచ్చు.. కానీ ప్రాణానికి ప్రమాదం జరిగితే తిరిగి పూర్వస్థితికి తీసుకురా గలమా? కోపం వచ్చినప్పుడు ఒక్క నిమిషం మౌనంగా ఉండటం బల హీనత కాదు.. మన జీవితాన్ని, ఎదుటివారి జీవితాన్ని కాపాడే గొప్ప సంయమనం. బస్సుల్లోనైనా, రోడ్లపైనైనా, నిత్యజీవితంలోనైనా చిన్న చిన్న విషయాలకే వాదనలకు దిగడం, పట్టుదలకు పోవడం, చేయి చేసుకోవడం చివరకు ఇలాంటి విషాదాలకు కారణమవుతున్నాయి. ఈ ఘటనలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనేది చట్టం తేలుస్తుంది. కానీ మనమంతా నేర్చుకోవాల్సిన పాఠం మాత్రం ఒక్కటే. గెలవమనం మాట్లాడే ఒక్క మాట, చేసే ఒక్క పని ఎదుటివారి జీవితాన్ని ఎంతలా ప్రభావితం చేస్తుందో ఆలోచించాలి. వివాదం ఎదురైతే సంయమనం పాటించాలి. అవసరమైతే అక్కడి నుంచి తప్పుకోవాలి. సమస్యను చట్టబ ద్ధంగా పరిష్కరించుకోవాలి.

మురసుతో పంటలు ఆగమాగం..!

కన్నీరు మున్నీరవుతున్న రైతులు




ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని మురసు తుఫానుతో రైతులు అల్లాడి పోయారు. గత మూడు రోజులుగా కురుస్తున్న మురసు ముసురుతో పంటలు ఆగమాగం అయ్యాయి. మండలంలో మూడు రోజులు పాటు కురుస్తున్న వర్షాలకు పత్తి వరి 30% పైగా నీట మునిగి పంటకు తీవ్ర నష్టం కలిగింది. మండల పరిధిలోని చిన్న కోరు కొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, రఘునాథ్ గూడెం, చంద్రు పట్ల, ఎర్రబోయినపల్లి, యజ్ఞ నారాయణపురం, కప్పల బంధం తదితర గ్రామాలలో అలుగులు వాగులు వెంట ఉన్న వరి పంట నీట మునిగి ఉండగా మరికొన్ని గ్రామాలలో నేలవా లి నీటిలో ఉండటం తో ఆ పంట దేనికి పనికి రావని తేల డంతో రైతుల్లో కన్నీ రు మొదలైంది. చేతి కందే దశలో ముర సు ముసురుతో రైతుల్లో ఆందోళన తీవ్రమైంది. ఒక్కో ఎకరాకు 30,000 పెట్టుబడి పెట్టగా చేతికందే దశలో తుఫానుతో ఆగం ఆగం కావడంతో రైతుల్లో కన్నీరు మొదలైంది. వర్షాభావ పరిస్థితి ఎల్ ఎల్ ని నో ప్రభా వంతో రైతులు ఆందోళన ఉండగా చివరకు వరుస తుఫానులతో పంట ఆగమాగం అయినట్లు రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో పంట 4800 ఎకరాలలో పంట నీటి ము న గ గా 2000 ఎకరాలలో వరి పంట నేలవాలి నష్టం వాటి ల్లినట్లు మండల మండలవ్యవసాయ శాఖ అధికారిని ఎం.రూప తెలిపారు.

చికిత్స పొందుతూ కండక్టర్ ప్రవళిక మృతి

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్ మీదుగా సురక్ష బస్టాండ్ నుండి పెట్రోల్ బంక్ మీదుగా అంబేద్కర్ సెంటర్ కి చేరుకొని పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ మహిళ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, గుండ్ల ప్రవళిక కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయా లని, ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలనీ, ప్రవళిక కుటుంబాన్ని ఎక్స్గ్రేస్ చెల్లించాలని, ఆర్టీసీ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొని తమ సంపూర్ణం మద్దతు తెలియజేసి ప్రవళిక కుటుంబాలు ఆదుకోవాలని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని నాయ కులు డిమాండ్ చేశారు. ఆమెకు సంతాపం సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సొందే కుటుంబరావు, సీపీఐ మణుగూరు మండల సహాయ కార్య దర్శి వేర్పుల నరేష్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఏ ఆర్ బాబు, రాజు, సందీప్, పూర్ణచందర్, యాదవ్, ఓంకార్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రోప్‌వే పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిం చిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. రోప్‌వే ప్రారంభమైన అనంతరం పర్యా టకులకు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రోప్‌వేకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు, వాహ నాల పార్కింగ్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. సంద ర్శకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రోప్‌వే నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమా ణాలు, సాంకేతిక తనిఖీలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాల న్నారు. ఖిల్లా రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటక రంగానికి మరింత ప్రోత్సహం లభించ డంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటకుల సంఖ్య పెరి గేలా, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా రోప్‌వే నిర్మాణం జరగాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి అన్ని పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసి రోప్‌వే సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని మంత్రి సూచించారు.

బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/కల్లూరుః బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ వ్యాపారస్తులను కోరారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండగను సురక్షితంగా జరుపుకునేలా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో దీపావళి పండుగ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు బాణసంచా విక్రయాలకు అనుమతులు తాత్కాలిక బాణసంచా విక్రయాల కేంద్రాల ఏర్పాటు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, ట్రాఫిక్ నియం త్రణ ప్రజల భద్రత అత్యవసర వైద్య సేవలు విద్యుత్ భద్రత తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో మండలాల పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

భారీ వర్షాలతో అన్నదాతలకు తీరని నష్టం

-నేలవాలిన వరి పైరు
-కన్నీరు మున్నీరవుతున్న రైతులు





ప్రజాపక్షం/రఘునాథపాలెం : గత కొద్ది రోజులుగా కురుస్తున్న ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు రఘునాథ పాలెం మండలంలో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికి అందిన వరి పంట నేలకొరిగి నీట మునగడంతో రైతులు కన్నీరు మున్నీ రవుతున్నారు. ఇటీవల వచ్చిన అర్నబ్ తుఫాన్‌తో పాటు ఇప్పుడు మురుసు తుఫాన్ ప్రభావంతో అన్నదాతల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గత రెండు రోజులుగా ఈదురు గాలులతో పాటు వర్షాలకు మండల పరిధిలోని కెవి బంజర, మూలగూడెంతో పాటు పలు ప్రాంతా లలో చేతికి అందివచ్చిన వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. వర్షంతో పాటు బలమైన గాలులకు వరి పైరు నేలవాలింది. పంట పొలాల్లో వర్ష పునీరు కంకులు తడిసిపోవడంతో ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి గురి కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపో యిన రైతులకు పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. నీట మునిగిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : సమజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని సైబర్ క్రైం సిఐ బి.రవికు మార్ అన్నారు. సైబర్ జాగృతి దివాస్‌లో భాగంగా డిఎస్‌పి సిహెచ్‌ఆ ర్‌వి ఫణిధర్ ఆదేశాల మేరకు బుధవారం ౭ధవారం సోషల్‌వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో సిఐ మాట్లాడారు. అపరిచిత మోయిల్స్, లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. అడ్వర్టయిజ్‌మెంట్ ఫ్రాడ్, ఐడెంటిటీ థెఫ్ట్‌ఫ్రాడ్, బిజినెస్, ఇన్‌వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్‌యాప్‌ఆర్నెమెంట్, బ్లాక్‌మెయిల్ ద్వారా జరిగే మోసలపై ఆయన విద్యార్థులకు వివరించారు. ఎవరైన సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్‌పోర్టల్ లో కేసు నమోదు చేయాలని తెలిపారు. వాట్సప్, టెలిగ్రామ్ యాప్‌లలో అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని అవి సైబర్‌నేరగాళ్లు పంపిన విగా భావించాలన్నారు. వాటిని ఓపెన్‌చేస్తే బ్యాంక్‌ఖాతాల్లోని నగదు ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఓటిపిలు, పాస్‌వార్డ్‌లు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికి తెలపడం, షేర్ చేయడం వంటివి చేయవద్ద న్నారు. ఈ సదస్సులో సైబర్‌క్రైం స్టేషన్ ఎస్సై ఎం విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎం ప్రసాద్, మహిళ కానిస్టేళ్లు నాగేంద్రమ్మ, అప్సనా, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ రీనాధరిదేవి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్ రద్దుకు పోరాటం

-వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ
-వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని తొలగిం చిన 13 కోట్ల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్ పేరుతో పోరాటం సాగిస్తున్నా మని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ తెలిపారు. బుధవారం ఖమ్మంలో సుందరయ్య భవనంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలన్నారు. రద్దయిన ఓట్లలో వ్యవసాయ, వలస కార్మికులు, దళితులు, మైనార్టీల ఓట్లే అధి కంగా ఉన్నాయన్నారు. దేశంలో తీవ్ర కరువు నెలకొన్న కేంద్ర ప్రభుత్వం ఎరువుల సబ్సిడీలను లక్షల కోట్లు తగ్గించి రైతులపై భారం మోపిందన్నారు. గోడౌన్లలో ఆరుకోట్ల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్న నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కరువు సాయం కింద రెండు లక్షల కోట్లు కేటాయించి, రేషన్ బియ్యాన్ని 10 కేజీలకు పెంచక పోతే డిసెంబర్‌లో మార్చ్ టూ గోడౌన్స్ చేపట్టి గోడౌన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. 22ఎ పేరుతో పేదల అసైన్డ్ భూములను వేలం వేస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి నల్లగొండలో జరిగే రైతు మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది తరలి వస్తార న్నారు. ఫిబ్రవరి 14 నుండి 17 వరకు బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులు పెంచి రోజు వారి కూలీ రూ. 600 చెల్లించాలని కోరారు. ఆర్టిసి కండక్టర్ ప్రవీళిక మృతికి ఆయన సంతాపం తెలిపారు. కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, నాగేశ్వరరావు, సారంగి పాపారావు పాల్గొన్నారు.

రూ.2.30లక్షలకు చికెన్, మటన్, చేపల వ్యర్థాల వేలం పాట

-మున్సిపల్ కౌన్సిల్ అనంతరం కాంట్రాక్టు అప్పగింత



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణ, తరలింపు హక్కుల కోసం మంగ ళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట రూ.2.30లక్షలకు ఖరా రైంది. ఈ వేలంపాటను సానిటరీ ఇన్సెపెక్టర్ వీరన్న కొనసాగించగా యోహోవా ట్రేడర్స్ అత్యధికంగా పాట పాడి ఈ హక్కులను దక్కించు కుంది. ఈ పాట ప్రభుత్వ కనీస ధర రూ.1.40లక్షలు నిర్ణయిం చగా..యోహోవా ట్రేడర్స్ రూ.1.63లక్షలు పాట పాడింది. అనంతరం ఆగ్రోవిట్ ట్రేడర్స్ రూ.1.75లక్షలకు పాటను పెంచింది. ఈ క్రమంలో ఇరు సంస్థల మధ్య పోటీ నెలకొనడంతో పాట ధర క్రమంగా పెరిగి చివ రకు రూ. 2.30లక్షల దగ్గర ఆగింది. అయితే వేలం ప్రక్రియకు సంబం ధించిన విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టి తీర్మానం అనంత రమే అధికారికంగా అప్పగింత చేపడతామని కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈవిఎం గోడౌన్ల వద్ద పటిష్ట నిఘా

-కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఈవిఎం గోడౌన్ల వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివా కర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ నెలవారి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి అవి పనిచేస్తున్నవి లేనివి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మ్రోగుతున్నది లేనిది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిప్టుల వారీ విధుల గురించి ఆరా తీశారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలని తెలి పారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఏ రాజు, డిటి అన్సారీ, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రఘునాథపాలెం ఎస్ఐ షాహీనా తెలిపారు. బుధ వారం మండల పరిధిలోని వేపకుంట్ల జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయు రాలు గాయత్రిదేవి అధ్యక్షతన విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నివారణపై అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ షాహీనా మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అప రిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, మోసపూరిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బాని సలై భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. చెడు వ్యసనాలకు గురి కాకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం గాయత్రిదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి అవగాహన సదస్సులు వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉప యోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, సోమ్లా, సుమలత, వెంక టనర్సమ్మ, రమేష్, మల్లికార్జునరావు, ఖతూం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలు

-ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈనెల 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నషా ముక్త్ భారత్, తెలంగాణ రైజింగ్ 2047 కార్యక్రమంలో భాగంగా ఈనెల 13న శుక్రవారం నాయుడుపేట సర్కిల్ సమీపంలోని టిసివి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై సమగ్ర అవగా హన కల్పించడం, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం, చరిత్ర, సంస్కృతి, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉప యోగపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఆరు నుంచి 12వ తర గతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీకి అర్హులని తెలిపారు. ప్రతి విద్యా సంస్థ నుండి గరిష్టంగా రెండు జట్లు (ఒక్కో జట్టుకు ఇద్దరు చొప్పున) నలుగురు పాల్గొనవచ్చునని తెలిపారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. ఈ క్విజ్ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరా లకు జి. చిరంజీవి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఖమ్మం వన్‌టౌన్, సెల్‌నెం. 8712658841, కె. రాజు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఖమ్మం టూటౌన్ సెల్ నెం. 8712658842, కిషోర్ రెడ్డి సెల్ నెం.9533998674లను సంప్రదించాలన్నారు.

సత్రం బజార్‌లో కాలువ పూడికతీత



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సత్రం బజార్‌లో వర్షాల కారణంగా ప్రధాన కాల్వ చెత్తా చెదారంతో పూడుకుపోయి వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయా న్ని తెలుసుకున్న 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిని అక్కడికి పిలిపించి జేసిబి సహాయంతో ప్రధాన కాల్వలో పేరుకుపోయిన చెత్త, పూడి కను తొలగించే పనులు చేపట్టారు. వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించి కాల్వ శుభ్రపరిచే పనులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రాలో కూటమి గెలుపు పట్ల హర్షం



ప్రజాపక్షం/వైరా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్, కార్పొరేట్ ఎన్ని కల్లో గెలవడం పట్ల వైరా తెలుగుదేశం నాయ కులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు కూటమి ప్రభుత్వం పనితీరును చూసి ఎన్నికల్లో పట్టం కట్టారని అన్నా రు. ఈ కార్యక్రమంలో నియో జకవర్గ నాయకులు చెరుకూరి చలపతి, తెదేపా అధ్యక్షులు కిలారి సురేందర్, మోతుకూరి వెంక టేశ్వరరావు, కట్టా నర్సింహారావు, బోదేపూడి మురళి, శ్యాంసుందర్, కందుల శ్రీనివాసరావు, తునాటి నర్సింహారావు, మద్దిన్ని రామారావు, గుండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాములేరు వాగు ఉధృతిని పరిశీలించిన ఎస్పీ





ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలో భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, మూకమామిడి ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో పలు చోట్ల వాహన రాక పోకలను అధికారులు నిలిపివేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్ర మత్తం చేశారు. తాళ్లపాయి గ్రామం వద్ద పాములేరు వాగు వరద ఉధృ తిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. డీడీఆర్ఎఫ్, ఎస్డీఆర్ ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజ లను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదే శించారు. మండలంలో వందలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునకగా, పలుచోట్ల వరి నేలకొరిగింది. పంట నష్టంపై అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి నివేదికలు రూపొందించి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మురసు తుఫాన్‌తో పంటలకు తీవ్ర నష్టం



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పంట పొలాలు నీట మునిగాయి. ఎదుర్లవాగు, లంకలవాగు, రావికంపాడు వాగు, బాల్యతండా వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కోతకు వచ్చిన వరి పంట నేలవాలగా, మిరప తోటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. పత్తి పంట తడిసి

-మోకాళ్ల లోతు నీటిలో ప్రభుత్వ పాఠశాల
-అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచన



ముద్దయింది. తిప్పనపల్లి పీఎస్ ముస్లిం కాలనీ ప్రభుత్వ పాఠశాలలోకి మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరింది. వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, మండల వ్యాప్తంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే బయటకు రావాలని తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ సూచించారు.

సైన్స్ ప్రయోగాలతో విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి



ప్రజాపక్షం/కూసుమంచి: ఖమ్మం నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజి యాన్ని బుధవారం కూసుమంచి గ్లోబల్ రెయిన్‌బో పాఠశాలకు చెందిన 9,10 తరగతులు 80 మంది విద్యార్థులు సందర్శించారు. వివిధ శాస్త్రీయ ప్రయోగాలు, ఆధునిక పరికరాల పనితీరును ప్రత్యక్షంగా పరి శీలించి ఆసక్తిగా తెలుసుకున్నారు. జిల్లా సైన్స్ అధికారి రచ్చ శ్రీనివాస్, ఇన్స్ట్రక్టర్లు ఆదిత్య కుమార్, నవీన్ కుమార్ బ్లాక్‌హోల్ కాన్సెప్ట్, ఇన్ని నిటీ వెల్, డెప్త్ పర్సన్షన్, ఫ్లోటింగ్ బాల్, సెంట్రిపిటల్, సెంట్రిఫ్యూగల్ ఫోర్స్ తదితర అంశాలను ప్రయోగాలతో వివరించారు. ప్రాక్సినోస్కోప్, న్యూటన్ క్రెడిల్, యాంటీ గ్రావిటీ డబుల్ కోన్, మానవ శ్వాస వ్యవస్థ

-ఖమ్మం జిల్లా సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన గ్లోబల్ రెయిన్‌బో విద్యార్థులు



నమూనాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. సందేహాలను నివృత్తి చేసు కుంటూ ప్రయోగాల వెనుక సూత్రాలను తెలుసుకున్నారు. ఈకార్యక్ర మంలో అకాడమిక్ డైరెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్, ఉపాధ్యా యులు సైదులు, రాంబాబు, ఉపేందర్, పాల్గొన్నారు.

సింగరేణి ఒప్పందాలు అమలు చేయాలి



ప్రజాపక్షం/ఇల్లందు: సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఏఐటీయూసీతో 2026 ఆగస్టు 28న కుదిరిన 24 అంశాల ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇల్లందు ఏరియాలోని గనులు, వివిధ విభాగాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయాన్ని ముట్టడించి జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ మెడికల్ బోర్డుల నిర్వహణ, మారుపేర్ల సమస్య, డిపెండెంట్ నియామకాలు, సొంత ఇంటి పథకం, రక్షణ పరికరాల సరఫరాపై ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ 59వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని, ఒప్పందంలోని అన్ని అంశాలపై తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఫిట్ కార్యదర్శులు దాట్ల వెంకటేశ్వర్లు, వి జయరాజ్, చిక్కా శ్రీనివాస్, రామారావు, రంజిత్ కుమార్, జర్పుల నరేష్, రవి శంకర్, సైదారెడ్డి, ఇబ్రహీం, జగదీష్, యుగేందర్, బట్టు రవి, సంతోష్ కుమార్, రావూజీ, ముఖ్బుల్ జాని, షరీఫ్, రేవంత్, సురేష్, గుగ్గిల శ్రీనివాస్, వివి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తుఫానుకు దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని పెరిక సింగారంలో తుఫాను ప్రభావానికి దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయాధికారి రామ డుగు వాణి పరిశీలించారు. పడిపోయిన పొలా ల్లో నీటిని తొలగించి, వరి పనలను నిలబెట్టి కట్టు కోవాలని సూచించారు. నీటిలో మునిగిన పూర్తి గా తయారైన గింజలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే వరిపైరుపై ప్రాపికోనజోల్ మందు పిచికారి చేస్తే కాటుక తెగులును నివా రించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

సిఇఐర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ల లభ్యం



ప్రజాపక్షం /గుండాల : గత కొద్దిరోజుల క్రితం సెల్ ఫోన్లను పోగొట్టుకున్న ఏడుగురు బాదితులు గుండాల పోలీసులకు ఫిర్యాదులు చేయగా, పోలీసులు సిఇఐర్ పోర్టల్ ద్వారా ట్రేస్‌చేసి కొద్ది రోజుల్లోనే దొరికి నటువంటి పోన్లను బాదితులకు బుదవారం సిఐ తిరుపతి, ఎస్సై శ్రావన్‌కుమార్ బాదితులకు అందచేయడంతో పోలీస్ వారికి కృతజ్ఞతలను తెలిపారు.ఈ సందర్భంగా సిఐ, ఎస్సైలు మాట్లాడుతూ సెల్‌పోన్లు పోయి న, దొంగి లిచబడ్డ పోలీసుల ద్వారాగాని, స్వయంగా గాని సిఇఐర్ పోర్టల్ లో నమోదు చేసినచో వాటిని ట్రేస్ చేసి బాదితులకు అప్పగించవచ్చునని విరించారు. కార్యక్రమంలో సిఐ,ఎస్సై తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న రేటుపై రైతుకమిటి సమావేశం




ప్రజాపక్షం /గుండాల : మండల రైతుకమిటి ఆద్వర్యంలో ఈ నెల 9న మొక్కజొన్న రేటుపై వ్యాపారులతో కూడి సమావేశం నిర్వహించను న్నట్లు కమిటి నాయకులు సర్పంచి కోరం సీతా రాములు, కోరం శాంతయ్యలు తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న సీజన్ ప్రారంభమై 15రోజులు గడుస్తున్నందున , రైతుకు గిట్టు బాటు ధర కోసం వ్యాపారులతో కూడి చర్చలు జరపనున్నట్లు తెలిపారు. వ్యాపా రులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో కమిటి సభ్యులు వాగబోయిన రమేష్, తోలెం గోపి, గోవింద నర్సింహారావు, కొడెం వెంకటేశ్వర్లు, కోండ్రు లక్ష్మి నారాయణ, వై వెంకన్న, గడ్డం లాలయ్య, ఇల్లందు నర్సింహులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రచారం



ప్రజాపక్షం/బూర్గంపాడు: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభ ద్రులు నవంబర్ 6లోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఫారం 18తో ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని బూర్గంపాడు మండల కాంగ్రెస్ శ్రేణులు కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు, ఉద్యోగులు, మైనారిటీ పాఠశాల, ఆశ్రమ గురుకుల ఉపా ధ్యాయులను కలిసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వర్‌రెడ్డి, బూర్గంపాడు మండల సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, యువజన నాయకుడు భజన ప్రసాద్ కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేసుపాక రాజేష్, మండల నాయకులు దాసరి సాంబయ్య, సీనియర్ నాయకుడు షేక్ మహబూబ్ పాషా, బీఎల్‌వీలు పుట్టి ప్రసాద్, అలవాల దుర్గాప్రసాద్, మూడో వార్డు సభ్యురాలు కేసుపాక ప్రవళిక, పెరుమాల్ల రాంబాబు, గుడిసెట్టి నరేష్, ఇసంపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పూనెం లక్ష్మీనారాయణకు కాంగ్రెస్ నేతల నివాళి



ప్రజాపక్షం/ఇల్లందు: కోయగూడెం మాజీ సర్పంచ్ పూనెం లక్ష్మీ నారాయణ(అబాయి) దశదిన కర్మకు కాంగ్రెస్ నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఆబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, ఇల్లందు సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ తాటి భిక్షం, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ మూతి కృష్ణ, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, మామిడిగూడెం సర్పంచ్ ఈసం బాలకృష్ణ, మాణిక్యారం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చెన్నూరి శ్రీనివాస్, దండుగుల శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక కుటుంబానికి రూ.1కోటి నష్టపరిహారం ఇవ్వాలి

- ఆర్టిసి సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి
- కండక్టర్ మృతి అత్యంత బాధాకరం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : విధి నిర్వహణలో తీవ్రంగా గాడపడి మృతి చెందిన ఆర్టిసి మహిళా కండెక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.1కోటి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఇటీవల ప్రయాణికులు బస్సు క్రిందికి తోసివేయడంతో హైదరాబాద్‌లోని సాయిసంజీవిని ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ ఆమె మృతి చెందడం అత్యంతబాధాకరం అన్నారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారం కొత్తగూడెం ఆర్టిసి డిపో ఎదుట గుర్తింపు సంఘం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభకు హాజరైన ఆయన ప్రవళిక చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో దాడి జరిగి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అన్నారు. ఆర్టిసిలో మహిళ కండెక్టర్లకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. ఇలాంటి దాడులు పనరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని బాధితకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, ఆర్టిసి గుర్తింపు సంఘం నాయకులు కందులభాస్కర్ నజీర్ అప్పారావు సింగ్ రవి సిపిఐ నాయకులు జక్కుల రాములు కె హన్మంతరావు దుర్గ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



ప్రజాపక్షం/చుంచుపల్లిః సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. 2026 ఆగస్టు 28న యాజమాన్యంతో కుదిరిన ఒప్పందంలోని హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి కార్పోరేట్ కార్యాలయం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూన్ 8న సమ్మె నోటీసు ఇవ్వగా, లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన చర్చల అనంతరం ఆగస్టు 28న యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందని గుర్తు చేశారు. అయితే ఒప్పందంలో పొందుపరిచిన పలు హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం కార్మికులను నిరాశకు గురిచేస్తోందన్నారు. ప్రతి నెలా నిర్వహిస్తామని హామీ ఇచ్చిన మెడికల్ బోర్డులను కేవలం మూడు నెలల తర్వాత నిలిపివేయడం అన్యాయమన్నారు. మెడికల్ బోర్డును తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మారుపేర్ల సమస్యపై గతంలో కుదిరిన ఒప్పందాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా పెండింగ్‌లో ఉన్న అర్హులైన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్నారు. కార్మికులకు ఇచ్చిన సొంత ఇంటి పథకం హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గనుల్లో రక్షణ పరికరాలు, యంత్రాలు సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగిస్తే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి రాముల, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు కమల్, భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మురసుతో నిండా మునిగిన రైతాంగం

- వరిపొలాలు వర్షార్పణం
- తడిసి ముద్దయిన పత్తి
- పంటలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి



ప్రజాపక్షం/పాల్వంచ : మురసు తుఫాను రైతాంగాన్ని నిండా ముంచుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. వర్షపు నీటితో పాల్వంచ పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. మండల పరిధి ఉల్వనూర్, రేగులగూడెం మొదలుకొని బంజెర, మల్లారం, మందెరికలపాడు, రెడ్డిగూడెం, సోములగూడెం,కేశవాపురం, సంగం, దంతెలబోర తదితర 36 గ్రామ పంచాయితీ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు వరి పొలాలు వర్షార్పణం అయినాయి. పత్తి పంట తడిసి ముద్దవుతోంది. మిర్చి తోటలు నేలవారుతున్నాయి. దంతెలబోర ఎస్సి కాలనీకి చెందిన రైతులు తాళ్ళ రాములు 9 , పొందు కొమురయ్య 10 , పండుగ నారాయణ 6 , బర్ల రోశయ్య 1 , బర్లబాబు 1, అచ్చమ్మ 2, చెక్క వాసు 1, తమ్మళ్ళ వెంకటేశ్వర్లు 1, కారుమంచి వెంకటేశ్వర్లు 1, బుసిపాక వెంకటేశ్వర్లు 02 ఎకరాల వరి పంట నీటి మునిగింది. పలు గ్రామాలలో పత్తి పంట తడిసి పోతున్నది. కాయలు నల్లబారి పోయి పంట దిగుడి తగ్గిపోవటమే కాకుండా నాణ్యత కోల్పోయి గిట్టుబాటు ధరలపై తీవ్ర ప్రభావం పడతుంది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నెత్తిన పిడుపడ్డ చందాన వచ్చిన తుఫాను నిండా ముంచుతున్నదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు దంతెలబోర ఎస్సి కాలనీ, బండ్రుగొండ రహదారి వరద నీటితో ముగిపోయింది. దీనితో ఆయా గ్రామాలకు రాకపోలకు అంతరాయం కలిగింది. దంతెలబోర, గొల్లగూడెం, జిమ్మకొయ్య వాగు ఉధృతికి చెరువు నిండి వరద నీరు రహదారిపైకి చేరింది. దెంతెలబోర గ్రామానికి పాల్వంచ మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ దమ్మపేట సెంటర్ నుండి శ్రీనివాసకాలనీ రహదారి ఆబ్కారీ కార్యాలయం దగ్గర నుండి నక్కలవాగుకు వెళ్ళె వరద నీరు రహదారిపై నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తున్నది.

- పంట నష్టాన్ని పరిశీలించిన ఏఒ :

తుఫాను కారణంతో మండలంలో కురిసిన వర్షానికి తడిసి పోయిన పత్తి, మునిగిపోయిన వరి పంటను మండల వ్యవసాయాధికారి శంభో శంకర్ పరిశీలించారు. దంతెలబోర ఎర్రచెరువు మత్తడి పోసిన వరదతో సుమారు 210 ఎకరాలలో వరిపోలాలు నీట మునిగాయన్నారు. ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా అధికారికి పంపించామని ఆయన చెప్పారు.

బ్రిడ్జిలపై నుంచి వరద నీటి ప్రవాహం.. గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాపక్షం/చుంచుపల్లిః చుంచుపల్లి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పెనుబల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోధుమ వాగుతోపాటు పెనగడపములుగుగూడెం మధ్య ఉన్న వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులపై నిర్మించిన బ్రిడ్జిల మీదుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల నుంచి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



కూలిన పాఠశాల ప్రహరీ గోడ



ప్రజాపక్షం/పాల్వంచ : గత రెండు రోజులుగా మురసు తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఓ పాఠశాల ప్రహరి గోడ కూలింది. పక్కనే ఉన్న ఓ వెంచర్‌లో నిర్మిస్తున్న భవన నిర్మాణాల కారణంతోనే గోడ కూలిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాల్వంచ పట్టణ పరిధి 45వ, డివిజన్‌లోని కొమ్ముగూడెం ఉన్నత పాఠశాల పక్కన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ భవన నిర్మాణాలతో వర్షపు నీరు వెళ్ళే మార్గం కనుమరుగైనది. దీనితో వచ్చిన వరదనీరు పాఠశాల ప్రహరీగోడకు ప్రమాదం ఏర్పడి కూలిందని తెలుస్తోంది.

తుఫాన్ దెబ్బకు రైతుల అల్లకల్లోలం

నేలవాలిన వరి నీట మునిగిన పంటలు.. అన్నదాతకు తీరని నష్టం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వరుస తుఫాన్లు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నేలవాలి, నీట మునిగాయి. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కళ్ల ముందే పంటలు నీటి పాలవుతుండటంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని మోటాపురం, రాజేశ్వరపురం, అమ్మగూడెం తదితర గ్రామాల్లో బుధవారం ఏపీ ఎం.రాధ నేలవాలిన పంటలను పరిశీలించారు. మంగాపురం తండాలో సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలకు వరి పంటలు నేలకొరిగి నీటిలో మునిగిపోవడంతో దిగుబడిపై రైతులు ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పెట్టుబడుల భారంతో సతమతమవుతున్న రైతులకు తుఫాన్ రూపంలో మరో కష్టం ఎదురైంది. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

తుఫాను బీభత్సం

పొంగి పొర్లిన వాగులు





ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల వ్యాప్తంగా,మురుసు తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. వర్షాల ధాటికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాల్లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మండలపరిధిలోని బేతాళపాడు, కాకర్ల, అన్నారప్పాడు, పలు గ్రామాల మధ్య ఉన్న వాగులు బుధవారం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు ఉప్పొంగి రోడ్డుపైకి వరద నీరు చేరడంతో గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఒక్కరోజు మండలంతో సంబంధాలు తెగిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటిదాకా ఎలినోవా ప్రభావం, అర్నబ్ సైక్లోన్ తుఫాన్, మరోవైపు మురుసు తుఫాను ప్రభావంతో వర్షాలు రైతాంగాన్ని తీవ్రంగా కోలుకోలేని దెబ్బతీశాయి. చేతికొచ్చిన పత్తి, తీసేందుకు కూలీలు దొరకక పత్తి పంట పూర్తిగా తడిసి ముద్దయింది. పొట్టకొచ్చిన వరి పంట అంతా వరద నీటిలో మునిగిపోయింది. వందలాది ఎకరాల్లో వరి చేలు నీట మునగడంతో పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

సింగభూపాలెం చెరువుకు పెరుగుతున్న వరద




ప్రజాపక్షం/సుజాతనగర్ః మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. ప్రధాన చెరువైన సింగభూపాలెం చెరువుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. చెరువుకు అలుగు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగభూపాలెం చెరువు ఎడమ కాలువ వద్ద 15 అడుగుల ఆరు అంగుళాలు, కుడి కాలువ వద్ద 19 అడుగుల నీటిమట్టం ఉంది. దీంతో ఈ ఏడాది సాగునీటికి ఢోకా ఉండదని, పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరోవైపు కురుస్తున్న భారీ వర్షాలు పంటలకు ముప్పుగా మారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి, వరి పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో అక్కడక్కడ పంటలు నీట మునిగాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒకవైపు చెరువులు నిండుతుండటంతో సాగునీటి భరోసా లభిస్తుందని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, మరోవైపు పంట పొలాల్లోకి నీరు చేరడంతో నష్టభయం వెంటాడుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటిమునిగిన పంటలను పరిశీలించాలని, పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టాలని, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

మురసు తుఫాన్‌తో అన్నదాతల్లో ఆందోళన

-నేలకొరిగిన వరి పొలాలు
-తడిసిన పత్తి పంట
-దిక్కుతోచని స్థితిలో రైతులు









ప్రజాపక్షం/వైరాः మురసు తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. తుఫాన్ ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వరి, పత్తి పంటలకు భారీ నష్టం వాటిల్లుతుంది. వైరా మండల పరిధిలోని పలు గ్రామాల్లో పండల ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు భారీ వర్షాలకు నేలకొరిగి నీటిలో మునిగిపోయాయి. పొలాల్లోకి వెళ్లి పంట పరిస్థితిని పరిశీలిస్తున్న రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రూపంలో ప్రకృతి విపత్తు విరుచుకుపడటంతో పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని వాపోతున్నారు. మరోవైపు పత్తి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చేతికొచ్చే దశలో ఉన్న పత్తి పంట అకాల వర్షాలకు తడిసిపోవడంతో నాణ్యత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న తమకు ఈ వర్షాలు మరింత భారంగా మారాయని కన్నీటిపర్యంతమవుతున్నారు. ప్రకృతి ఎప్పుడు తమపై పగ పడుతుందో తెలియడం లేదని, ఏటా ఏదో ఒక రూపంలో పంట నష్టా ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావం ఇంకా కొన సాగుతుందా? వర్షాలు మరింత పెరిగితే ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. మురసు తుఫాన్ తమను నట్టేట ముంచిందని, ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు అండగా ఉంటాం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు



ప్రజాపక్షం/ఖమ్మంః అనునిత్యం దోపిడి గురవుతున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు, కండక్టర్లకు అండగా ఉంటామని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లపై ఆర్టీసీ అధికారుల వేధింపులు అపాలని అన్నారు. మిగిలిన చోట్ల నెలకు రూ.28 వేలు జీతం చెల్లిస్తుండగా, ఖమ్మం జిల్లాలో రూ.25 వేలు మాత్రమే చెల్లించడమేంటని ఆయన ప్రశ్నించారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదో అధికారులు తెలియజేయాలని అన్నారు. రెగ్యులర్ ఆర్టీసీ డ్రైవర్లకు ఇస్తున్న మాదిరిగానే వీరికి కూడా ఓటి, సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంతో పాటు మిగిలిన అన్ని డిపోలలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లను ఏకచేసి రిజనల్ స్థాయి ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల కమిటీని వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ గాదె లక్ష్మీ నారాయణ, ప్రజా సంఘాల నాయకులు ఆకెన పవన్, ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు హుస్సేన్, సురేష్, చందు, నాగరాజు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ మృతికి నిరసనగా విధులు బహిష్కరణ



ప్రజాపక్షం/మధిరः మణుగూరు డిపోకు చెందిన ఆర్‌టిసి కండక్టర్ ప్రవీళికపై ప్రయాణికురాలు జరిపిన అమానుష దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె, గత పది రోజులుగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కండక్టర్ ప్రవీళిక మృతి పట్ల మధిర డిపో కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాదకర ఘటనను నిరసిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధిర డిపోలో మొదటి బస్సు నుంచే కార్మికులు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కండక్టర్ ప్రవీళిక మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు ఆర్‌టిసి ఉద్యోగులందరికీ విధి నిర్వహణలో పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మధిర డిపో జేవీసి నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవీళిక మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గిరిజనుల సమస్యలపై ఉద్యమించాలి

-తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి







ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ తెలిపారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం తేజావత్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గిరిజన సమాఖ్య ఇంచార్జ్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల సమస్యలపై ఉద్యమించాలని దానికి అనుగుణంగా నాయకులు పని చేయాలన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో కమిటీల నిర్మాణం ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో జాతీయ మహాసభలు నిర్వహించడం హర్షణీయమన్నారు. త్వరలో మహాసభల తేదీలను ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలలో పనిచేస్తూ పార్టీని విస్తరింపజేసేవిధంగా ప్రతి గిరిజన నాయకుడు కృషి చేయాలన్నారు. గిరిజనులలో 32 ఉపకులాలు ఉన్నాయని గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. సబ్ ప్లాన్ నిధులు, రైతులకు అందించే సబ్సిడీ పరికరాలు సరైన రీతిలో అందడం లేదన్నారు. గిరిజన సమాఖ్య బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడా వీరన్న, శేఖర్, ఖమ్మంజిల్లా కార్యదర్శి బానోత్ జగన్నాథం, జిల్లా అధ్యక్షులు బానోత్ రాంబాబు, రాంకోటి, జిల్లా నాయకులు బానోత్ నాగేశ్వరరావు, నర్సింహా, గుగులోత్ శ్రీను, పాల్తీయా శ్రీను, భరత్, వీరన్న, రామ్మూర్తి, ప్రసాద్, సీతారాం, హరిదాస్, నాయకులు పాల్గొన్నారు.

నిండుకుండలా వైరా రిజర్వాయర్

19 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం





ప్రజాపక్షం/వైరాः మురసు తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో రిజర్వాయర్ అలుగులపై నుంచి నీరు పరవళ్లు తొక్కుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం సుమారు 19 అడుగులకు చేరుకుంది. భారీ వర్షాలతో వైరా రిజర్వాయర్ మరోసారి జలకళను సంతరించుకుంది. నిండుకుండలా మారిన రిజర్వాయర్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఆనకట్ట వద్దకు చేరుకుంటున్నారు. అలుగులపై నుంచి ప్రవహిస్తున్న నీటి అందాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. గత కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులతో కనిపించిన రిజర్వాయర్ తుఫాన్ ప్రభావంతో ఒక్కసారిగా నీటిమట్టం పెరగడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఇదేవిధంగా వర్షాలు కొనసాగితే రిజర్వాయర్‌లోకి మరింత వరద నీరు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మురసు తుఫాన్ బీభత్సం

- స్తంభించిన జనజీవనం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట ः దమ్మపేట మండలంలో మురసు తుఫాన్ కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రెండురోజులు పాటు కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. రెండో మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు అవ్వడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో అశ్వారావుపేట, దమ్మపేట పట్టణాల్లోని ఇళ్లల్లోకి నీళ్లు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోని ఫ్రిజ్‌లలో అనేక ఆహార పదార్థాలు మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అశ్వారావుపేట మండలంలో పెద్దవాగు ప్రాజెక్టు ఎగువ ప్రాంతం గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా పెద్దవాగు ప్రాజెక్టులోకి నీరు చేరటంతో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ట్యాంక్‌బండ్‌కు గండి పడింది. దీంతో మూడు కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరు అయినట్లు అయింది. మండల వ్యాప్తంగా నీటి ఉధృతికి రోడ్లపైకి నీరు చేరటంతో నారాయణపురం, బొచ్చువారిగూడెం, నందిపాడు, గుమ్మడిపల్లి, అశ్వారావుపేట, ఊట్లపల్లి, వాగోడ్డుగూడెం, అశ్వారావుపేటకు వచ్చిపోయే రహదారుల పైకి పెద్ద మొత్తంలో నీళ్లు రావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అంకమ్మ చెరువు అలుగు పొంగి పొర్లటంతో భద్రాచలం రోడ్‌లోని ఊట్లపల్లి సమీపంలో హైలెవల్ వంతెన వద్ద పై నుండి నీళ్లు పెద్ద ఎత్తున వెళ్తుండటంతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారులు కొట్టుపోతుండటంతో ఆ సమయంలో సమీపంలోని గ్రామస్తులు వారిని కాపాడి సురక్షితంగా పంపించారు. అశ్వారావుపేట పట్టణంలోని గౌడ బజార్, కాలింగల బజార్, వడ్డెర బజార్లోకి భారీ ఎత్తున నీరు చేరడం, దొంతుకుంట లోతట్టు ప్రాంతంలో ఉన్న ఖరీదైన భవనాల్లోకి నీళ్లు రావడంతో దొంతకుంటచెరువుకు గండిపెట్టినట్లు రైతు రామకృష్ణ ఆరోపిస్తున్నాడు. అంతేకాకుండా ఎఎస్ఆర్ నగర్, డ్రైవర్ కాలనీ, ఖమ్మం రోడ్డు, లక్కీ అపార్ట్‌మెంట్ ఏరియాలో భారీ ఎత్తున నీరు చేరడంతో ఇళ్లలోకి నీళ్లు వచ్చి విద్యుత్ పరికరాలు ఇతర వస్తువులు అన్ని శుభ్రంగా తడిసిపోయాయని బాధితులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దమ్మపేట మండలంలో కొత్తపేటలోని ఇళ్లలోకి నీళ్లు చేరటంతో దమ్మపేట డిప్యూటీ కలెక్టర్ పునర్వాస కేంద్రాలకు తరలించారు. దమ్మపేట ప్రాంతంలో కూడా అనేక లోతట్టు ప్రాంతాల్లో రోడ్లన్ని జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలంలో వరి పంటలకు పత్తి ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అశ్వారావుపేట మున్సిపాలిటీ కమీషనర్, రెవెన్యూ సిబ్బంది విద్యుత్ సిబ్బంది తదితర అధికారులు జలమయమైన ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలను చేపట్టారు.

ఇందిరా డైరీ పథకం ద్వారా గేదెల మంజూరు



ప్రజాపక్షం/మధిరः మధిర నియోజక వర్గం నుంచే అన్ని గ్రామాలకు పాలు సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో, డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో డిప్యూటీ సిఎం భట్టి నియోజకవర్గంలోని డ్వాక్రా గ్రూపు మహిళల కు గేదెలను మంజూరు చేశారు. వీటిని పక్క రాష్ట్రంలోని గ్రామాల్లో దొరికే పాడి గేదెలను లబ్దిదారులే స్వయంగా వెళ్లి ఎంపిక చేసుకొని, తమ గ్రామాలకు తీసు కొని వస్తున్నారు. దానిలో భాగంగానే ఇల్లూరు గ్రామానికి చెందిన నలుగురు ఆంధ్రప్రదేశ్‌లోని ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లోకి వెళ్లి వారికి నచ్చిన పాడి గేదెలను స్వయంగా కొనుగోలు చేసుకొని ఇల్లూరు గ్రామానికి వచ్చారు. అట్టి గేదెలను కొనుగోలు చేసిన కుటుంబాల ఇళ్లకు గ్రామ కాంగ్రేస్ నాయకులు వెళ్లి వాటిని పరిశీలించారు. డ్వాక్రా మహిళలకు గేదెలకు మంచిగా పచ్చిగడ్డి, ఎండు గడ్డి, దాని వేసి బాగా పెంచాలని, పశుపోషణలోని మెళకువలను తెలుసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రేస్ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రేస్ నాయకులు దామ రాఘవేంద్రరావు, కోటా సుభాష్, కటారపు శివ, స్థానిక పశువుల డాక్టర్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో స్తంభించిన జనజీవనం



-రహదారులపైకి వరద
-చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
-శాశ్వత పరిష్కారాలేవి..
-వరద నీటి మళ్లింపుపై అధికారుల నిర్లక్ష్యమెందుకు?



ప్రజాపక్షం/సత్తుపల్లిః మురసు తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలు రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తుండగా, లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. చేతికొచ్చిన పంట, ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.న తుపల్లిసిద్ధారం రహదారిపై వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోగా, కిష్టారంచెరుకుపల్లి రహదారిలో లోలెవల్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. రాజీవ్‌నగర్ నుంచి సత్తుపల్లికి చేరుకోవాలన్నా, సిద్ధారం వెళ్లాలన్నా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు సత్తుపల్లికాకర్లపల్లి రహదారిలో గాడిదల వాగు ఆక్రమణలకు గురికావడం, వరద నీరు వెళ్లేందుకు తగిన మార్గం లేకపోవడంతో సమీప పంట పొలాలు నీటమునిగాయి. వెంగళరావునగర్‌లోని లోతట్టు ఇళ్లలోకి నీరు చేరగా, బేతుపల్లినారాయణపురం రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. పలు గ్రామాల్లో పశువుల కొట్టాలు కూలిపోయాయి. వరదల సమయంలో అధికారులు రహదారులపై రాకపోకలను నిలిపివేస్తున్నప్పటికీ, వరద నీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు వెళ్లేలా శాశ్వత చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ఎందుకనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. సైడ్ డ్రైనేజీల నిర్వహణ, పూడికతీత, ఆక్రమణల తొలగింపు, లోలెవల్ బ్రిడ్జిల మరమ్మతులపై ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ స్థాయిలో ఇబ్బందులు తప్పేవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, బేతుపల్లి చెరువులోకి భారీగా వరద నీరు చేరి నీటిమట్టం 16 నుంచి 17 అడుగులకు చేరినట్లు సమాచారం. పలు వార్డుల్లో కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా ఆదేశాలతో స్థానిక నాయకులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో సర్పంచ్‌లు సైతం నేల కొరిగిన చెట్లను తొలగించడం, బాధితులను ఆదుకోవడంలో ముందుకు వచ్చారు.భవిష్యత్తులో వరద ప్రవాహ మార్గాలను అడ్డుకునే నిర్మాణాలను నియంత్రించి, ఆక్రమణలను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా ప్రజలకు, రైతులకు శాశ్వత ఉపశమనం కల్పించేలా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాల ముంపు సమస్యను నివారిస్తాం

- మేయర్ మూడ్ గణేష్



ప్రజాపక్షం/పాల్వంచ : లోతట్టు ప్రాంతాలలో ముంపు సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలను కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో పాల్వంచలో బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా 8, 42వ, డివిజన్‌లలో నిలిచిన వరద నీటిని డ్రైన్‌లోకి మళ్ళించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై నిలిచే వరద నీటిని సమీప మురుగు కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. వరద నీరు పోటెత్తి ఆవాసాల్లోకి చేరకుండా అదనపు మోటార్లు ఏర్పాటు చేసి తోడేయాలని సూచించారు. డ్రైన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను జేసిబి సాయంతో తక్షణమే తొలగించి పూడికతీత పనులను వేగవంతం చేయాలని, వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలతో విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్, దోమల మందు పిచికారి పనులు చేపట్టాలని చెప్పారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్‌ను సమన్వయం చేసుకొంటూ తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వర సహాయం అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, అసిస్టెంట్ కమీషనర్ విజయానంద్, డిప్యూటి మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు నామా పండు, కాకటి రవీందర్, కాంగ్రెస్ నాయకులు రవి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్ చౌహాన్ పాల్గొన్నారు.

రైతు భరోసా డబ్బులంటూ ఫేక్ మెసేజ్‌లు..!

బ్యాంకుల చుట్టూ తిరిగిన రైతులు.. ఖాతాల్లో జమకాని నగదు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమయ్యాయంటూ రైతుల సెల్‌ఫోన్లకు వస్తున్న సందేశాలు గందర గోళానికి దారితీస్తున్నాయి. బుధవారం తెల్లవారుజాముననుంచి AXTGAGRLS అనే ఐడీ నుంచి రైతుల ఫోన్లకు వరుసగా సందేశాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరుతో రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందించే సాయంలో భాగంగా రూ.6,450 బ్యాంకు ఖాతాలో జమయ్యాయని పేర్కొంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. దీంతో వాటిని నిజమని నమ్మిన రైతులు తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు బ్యాంకులకు పరుగులు తీశారు. అయితే ఖాతాలను పరిశీలించగా ఒక్క రూపాయి కూడా జమ కాలేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో రైతులు అయోమయానికి గురయ్యారు. అసలు డబ్బులు పడకుండానే మెసేజ్‌లు ఎందుకు వచ్చాయో అర్థంకాక నిరాశతో వెనుదిరిగారు. మండలం లోని పలువురు రైతులకు ఇలాంటి సందేశాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి పేరుతో అధికారిక సమాచారం తరహాలో మెసేజ్‌లు రావడంతో రైతులు వాటిని నిజమని భావిస్తున్నారు. నిజంగానే రైతు భరోసా నిధులు విడుదలయ్యాయా? తమ ఖాతాల్లో నగదు ఎందుకు జమ కాలేదంటూ ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారులను వివరణ కోరగా, సాంకేతిక కారణాల వల్ల ఇలాంటి సందేశాలు వస్తున్నాయని తెలిపారు. ఇవి ఫేక్ మెసేజ్‌లని, రైతు భరోసా నిధుల జమకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని స్పష్టం చేశారు. కేవలం మెసేజ్‌లు వచ్చినంత మాత్రాన ఖాతాల్లో నగదు జమ అయినట్లు భావించవద్దని సూచించారు.

> తెలంగాణ రైతాంగానికి నమస్కారం...
> రైతు భరోసా పథకంలో భాగంగా మన ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎకరాకు ఇచ్చే మొత్తాన్ని రూ.12,000కు పెంచింది.
>
> తదనుగుణంగా రూ.6450/- మీ బ్యాంకు ఖాతా నెంబర్ UBIN XXXXXX0960 కు జమచేయబడినవి.
>
> ఈ సహాయం మీ వ్యవసాయ పెట్టుబడికి ఉపయోగపడుతున్నందుకు సంతోషిస్తున్నాను.
>
> మీ ముఖ్యమంత్రి
> ఎ. రేవంత్ రెడ్డి

అధికారుల నుంచి స్పష్టత ఏదీ?

నగదు జమ కాకుండానే జమ అయినట్లు సందేశాలు రావడానికి కారణాలేమిటి..? ముఖ్యమంత్రి పేరుతో ఇలాంటి సందేశాలు ఎలా వెలువడుతున్నాయి? సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందన్న దానిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. తప్పుడు సమాచారంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ప్రవళిక మృతి తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొంటూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ప్రవళికకు నివాళులర్పించిన మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

ప్రజాపక్షం/మణుగూరుః



ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద కండక్టర్ ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులు అర్పించారు. ప్రవళిక తల్లిని పరామర్శించి వారికి ఆర్టీసీ కుటుంబం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మరియు ఆర్టీసీ నుండి 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా, ఆర్టీసీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా బ్యాంకు నుండి కోటి రూపాయలు ప్రమాదా భీమా అందనుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలు కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఈ సంఘటనకు జరగగానే మేనేజ్మెంట్ తరపున ఆసుపత్రికి కూడా వెళ్ళినామని మంచి చికిత్స అందించే ప్రయత్నం చేసినాం కానీ దురదృష్టవశాత్తూ కండక్టర్ ప్రవళిక దూరమైంది అన్నారు. ఆనాడు ప్రమాదం జరగగానే హాస్పిటల్ కి వెళ్ళి మంచి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నాం అన్నారు.

వరద ప్రాంతంలో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్



ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని మూకమామిడిలో వరద ప్రభావిత ప్రాంతంలో చిక్కుకున్న రాయల మధును రాష్ట్ర విపత్తుల స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్)బృందం సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. ఎస్‌పీ రోహిత్ రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ సహాయక చర్యల్లో ఎస్‌ఐ మధుప్రసాద్, తహసీల్దార్ స్వాతి బిందు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలి : బిజెపి

ప్రజాపక్షం/ తల్లాడ : తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేలు నష్టపరిహారం అందించాలని బిజెపి రాష్ట్ర నాయకులు నంబూరి రామలింగేశ్వర రావు, జిల్లా నాయకులు ఆపతి రామారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లాడ మండలంలో వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తి, మిర్చి పంటలు తుఫాన్ ప్రభావంతో నేలకొరిగి తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు ఎకరానికి రూ. 50వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సెల్వరాజ్, నర్సింహారావు, అప్పారావు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాపక్షం/ తల్లాడ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణలో సిఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. సన్న బియ్యంతో పాటు ఆసుపత్రిలో పేదలకు లక్ష్మల్లో వైద్య రంగానికి నిధులు సమకూర్చడం జరిగిందన్నారు. త్వరలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటుకు దరఖాస్తు చేసుకుని కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, తల్లాడ మండలం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుండేటి వీరారెడ్డి, ఉప సర్పంచ్ యశోద, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవీంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షులు సీతారామయ్య, మాజీ సర్పంచ్ సీతారాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణయ్య, మురళీ పాల్గొన్నారు.



ముసురు తుఫాన్‌తో భారీ వర్షం.. పంట నష్టం..!



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం గొల్లగూడెం, కిష్టపురం, అన్నారుగూడెం, నారాయణపురం, తల్లాడ, గోపాలపేట, కుర్నావల్లి, మిట్టపల్లి గ్రామాల్లో ముసురు తుఫాన్ ప్రభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు, ఈదురు గాలులకు వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. మరో వారం రోజుల్లో చేతికి రావాల్సిన పంట ఒక్కసారిగా నేలకొరగడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. చేతికి వచ్చిన పంట కండ్ల ముందే నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామంలోని చెరువులు, కుంటల కింద రైతులు ఎంతో ఆశతో వరి పంటను సాగు చేశారు. సకాలంలో వర్షాలు పడడంతో పంట బాగా వచ్చింది కోత దశకు వచ్చిన తరుణంలో ముసురు తుఫాన్ కారణంగా వరద తాకి

-నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వేడుకోలు



డికి పంట నేలమట్టమైంది. వరి కంకులు నీటిలో ఉండిపోవడంతో మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోకి భారీగా నీరు రావడంతో పంట కోతకు కూడా వీలు లేకుండాపోయింది. రైతు కోడూరు వీర కృష్ణ మాట్లాడుతూ తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం ఐదు ఎకరాల్లో వరి సాగు చేశానని తెలిపారు. ఎకరాకు విత్తనాలు, ఎరువులు, కూలీలతో కలిపి రూ. 50వేల చొప్పున మొత్తం రెండున్నర లక్షల వరకు పెట్టుబడులు పెట్టానన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే పంట పొలాలను పరిశీలించి నష్ట అంచనా వేసి పరిహారం అందించాలని ఆయన కోరారు. అదే గ్రామానికి చెందిన రైతులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, లక్ష్మ య్య, నర్సింహారావు, అమర్తయ్య, పుల్లారెడ్డి, వెంకటయ్య, కొండలరావు తదితర రైతుల పంట పొలాలు కూడా వరద తాకిడికి నేలమట్టమయ్యాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముసురు తుఫాన్‌తో భారీ వర్షం

చేతికందిన పంటలపై తీవ్ర ప్రభావం



ప్రజాపక్షం/పెనుబల్లిః ముసురు తుఫానుతో ముసురు పట్టి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. ముసురు తుఫాను ప్రభావం పెనుబల్లి మండలంపై తీవ్రంగా కనిపించింది. తీరం దాటిన ముసురు తుఫాను ప్రభావంతో సోమవారం,మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మరో ప్రక్క బోర్లు చెరువుల కింద వేసిన వరి కొన్నిచోట్ల కోతలకు దశలో వర్షాలు కురవడం, మరి కొన్ని గ్రామాలలో కోతలు కోసి కల్లాలలో ఆరబోసిన ధాన్యం తడిసిపోతుందని కొందరు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండాలపాడు, ఏరుగట్ల, రామచంద్రపురం, లింగగూడెం, బ్రహ్మలకుంట, చౌడవరం, గంగదేవి పాడు, పార్థసారథి పురం, లింగగుడెం,గ్రామాలలో పత్తి పంట కాయ విచ్చుకుని పత్తి ఒలిసే సమయంలో వర్షాలకు నష్టం వాటిల్లుతుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ ఈ వర్షాలతో కోతకి వచ్చిన పంట నేలకి ఒరిగింది. నుండి తలపెంట వెళ్లే రహదారిలో రోడ్డు పైకి వర్షపు నీరు ప్రవహిస్తున్నాను తో రెండు గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా నుండి కుప్పనకుంట వెళ్లే రహదారులు సైతం వరుసపు నీరు ప్రవహిస్తుందో రాకపోకలు నిలిచిపోయాయి. లంకాసాగర్ ప్రాజెక్ట్ 16 అడుగులు దాటి అలుగు పడిందని, రాతోని చెరువు 12 దాటి అలుగు పడిందని, చిన్న, పెద్ద చెరువులు నిండి కళ కళ లాడుతున్నాయి రెవెన్యూ అధికారులు మండలంలో ముసురు తుఫానుకు సంబంధించి ఇల్లులు దెబ్బతిన్నాయని ఆరా



తీశారు. గౌరారం పంచాయతీ రామచంద్రపురం పంచాయతీలో రెండు ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని రెవెన్యూ అధికారులు గుర్తించారు. మండలంలో సుమారు 21 ఎకరాలు వరి సాగు రైతులు చేశారు. పత్తి పంట 1600 ఎకరాలు, మిర్చి 1000 ఎకరాలు సాగులో ఉండగా వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో రైతులకు వరి 5,255 ఎకరాలు పత్తి 500 ఎకరాలు, మిరప 623 ఎకరాలు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాలు వేసారు. ముఖ్యంగా గణేష్ పాడు, కారాయి గూడెం, లింగగూడెం, కుప్పనకుంట గ్రామాలలో పరిసాగు ముందుగానే రైతులు సాగు చేయటంతో ముసరు తుఫాను ప్రభావం వాటిపైన పడింది. వరి పంట కోతకు వచ్చిన సమయంలో తుఫాను ప్రభావంతో వరి పంట నేలకు ఒరిగి వర్షపు నీటికి తడిసి ముద్దయింది. చేతికి వచ్చిన పంట తన కళ్ళ ముందే తుఫాను ప్రభావం లో చిక్కుకొని జరిగిన పంట నష్టం పైన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రత్తి సాగు విషయంలో పత్తి కాయ నుండి దూది ఉత్పత్తి అయ్యే దశలో తుఫాను ప్రభావం వలన తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు పత్తి సాగును ఎక్కువ శాతం పోడు భూములు పొందినగిరిజన రైతుల పొలాల్లోనే ఎక్కువగా పత్తి సాగును సాగు చేశారు. చేతికొచ్చిన పంట నాశనం అవటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామచంద్రాపురం, వెంకటగిరి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం నారాయణ పురం, వెంకట గిరి గ్రామాల మధ్య ఉన్న వాగు ముసరు తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో వాగు పొంగిపొర్లుతుంది. దీనితో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ప్రవాహం దాటేందుకు ప్రజలు ప్రయత్నించకుండా స్థానికులు ట్రాక్టర్లను అడ్డంగా ఉంచి వాహన రాకపోకలను నిలిపి వేశారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది

-రాకపోకలు బంద్
-హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్



పాటి వర్షం కురిసినా ఈ వాగు పొంగి పొర్లుతుండడంతో రామచంద్రాపురం, వెంకటగిరి గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అత్యవసర సమయాల్లో అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు గ్రామాల మధ్య వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రామచంద్రాపురం, వెంకటగిరి గ్రామాల మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్ పరికరాల దొంగల అరెస్ట్



ప్రజాపక్షం/పెనుబల్లిః పెనుబల్లి మండలం, వేంసూరు మండలం పరిధిలో రైతులకు ట్రాక్టర్‌కు సంబంధించిన ట్రాక్టర్ పరికరాలు, ఫుల్ వీల్స్, రోటోవేటర్ దొంగలించిన ఐదుగురు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సిఐ పి. సర్వయ్య, వియం.బంజర్ ఎస్సై ఎస్‌కె. షాకీర్, వేంసూరు ఎస్సై పి. ప్రదీప్ లతో కూడిన విలేకర్ల సమావేశంలో బుధవారం వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో సిఐ సర్వయ్య మాట్లాడుతూ గత కొద్ది నెలలు పెనుబల్లి, వేంసూరు మండలాల్లో రైతుల ట్రాక్టర్లకు సంబంధించిన సామాగ్రి చోరికి గురైనట్లు అనేక ఫిర్యాదులు అందాయి. బుధవారం పెనుబల్లి మండల పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద వి.యం బంజర్ ఎస్సై షాకీర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రాచమల్లు, శ్రీనివాసులతో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు అశోక్ లే లాండ్ వాహనాలతో ఆపి ప్రశ్నించగా అనుమానస్పదంగా వ్యవహరించడంతో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారైనట్లు సీఐ సర్వయ్య తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో పంతంగి చెన్నకేశవ్, కుంట రాఘవేంద్ర సత్తుపల్లి మండలం, మేకల గోవర్ధన్ అశ్వారావుపేట మండలం, గోబిన నవీన్ అశ్వారావుపేట మండలం, పుచ్చి ముత్తయ్య దమ్మపేట మండలంలను అదుపులోకి తీసుకోగా ఎస్‌కె. మస్తాన్ దమ్మపేట మండలానికి చెందిన నిందితుడు పరారీలో ఉన్నట్లు అదే విధంగా వీరి వద్ద నుండి ఎనిమిది ఫుల్‌వీల్స్, ట్రాక్టర్ సామాన్లు స్వాధీనపరచుకున్నామని వీటి విలువ సుమారు రూ. 6,50,000లు ఉన్నట్లు అంచనా వేశారు. వీరిని బుధవారం కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

రోజానమ్మకి నివాళి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ నారాయణపురం నివాసి, యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు న్యాయమూర్తి అంగిడి జయరాజు మాతృమూర్తి అంగిడి రోజానమ్మ ఇటీవల మృతిచెందారు. బుధవారం నారాయణపురంలోని జిఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆమె దశదిన కర్మ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోజానమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరావు, బాబురావు, ఖమ్మం జిల్లా కోర్టు న్యాయవాది తొండపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, సీతారామరెడ్డి, ప్రసాద్, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ వితరణ



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ, వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలపేట గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని శెట్టి ఉమారేణుక కు బుధవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా పిడిజి కాపా మురళీకృష్ణ, తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కర్నాటి లక్ష్మారెడ్డి లు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థికి చదువు నిమిత్తం రూ. 40వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ లయన్స్ క్లబ్ సభ్యులు శీలం వెంకట్‌రెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, చిట్టెం నర్సింహారావు, వైరా సభ్యులు లగడపాటి ప్రభాకర్, ఉండు శ్యాంబాబు, పెరుమాళ్ల ఇంద్రాణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

16న అయ్యప్ప స్వామి ఆలయ శంకుస్థాపన



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడలో కొత్తగూడెం రోడ్డులో ఈనెల 16న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ తల్లాడ అయ్యప్ప స్వామి పీఠానికి చెందిన స్వాములు బుధవారం గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ శంకుస్థాపన కార్యక్రమ వివరాలు తెలియజేసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను స్వాములు వివరించారు. గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఈలప్రోలు లాలయ్య స్వామి, అర్చకులు మణికంఠ శర్మ, బాలకృష్ణ స్వామి, పసుమర్తి కాశీ స్వామి, పెరిక మణికంఠ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/కల్లూరుఃతెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఎలక్ట్రోరల్ లిట్రసి క్లబ్బుల ద్వారా విద్యార్థులకు వ్యాసరచన మరియు క్విజ్ పోటీలను నిర్వహించేందుకు సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రిజిస్ట్రేషన్ అధికారులు మరియు మండల విద్యాశాఖ అధికారులు తో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యత మరియు ఎన్నికల పట్ల అవగాహనను పెంపొందించడంలో ఎలెక్ట్రోరల్ లిట్రసి క్లబ్బులు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కల్లూరు తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, పోలీస్‌అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.